క్లుప్తంగా

రాయకుదురులో పశువైద్య శిబిరం



రాయకుదురులో పశువులకు చికిత్స చేస్తున్న దృశ్యం

వీరవాసరం: రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ వారి ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని మంగళవారం రాయకుదురులో ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో భీమవరం నియోజకవర్గం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ పి.సుధీర్ బాబు పాడి రైతులు సరైన సమయంలో పశువులకు వ్యాధుల నివారణ టీకాలు, వైద్య పరీక్షలు చేయించాలన్నారు. సుమారు 80 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గెద్దం భారతి, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల రాము, కడలి నెహ్రూ, ఎల్‌డీఏ డీడీ జేసు రత్నం, మండల పశు వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక రాబర్ట్, డాక్టర్ ఫణి, డాక్టర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



ఉండిలో జెండా ఊపి శాంతి ర్యాలీ ప్రారంభిస్తున్న ఈవోపీఆర్‌డీ రామకృష్ణారెడ్డి

ఉండి: మానవత సేవాసంస్థ ఉండి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉండిలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ రామకృష్ణారెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యావత్ ప్రపంచమంతా శాంతి సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఉండి నిమ్మల సెంటర్‌లోని మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు కార్యకర్తలు ర్యాలీని కొనసాగించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు పెన్మత్స రామకృష్ణంరాజు,గాదిరాజు రంగరాజు, మండల కన్వినర్ కొమ్మన నాగబాబు, కో-చైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ



భీమవరంలో రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణలో మోషేనురాజు, ఇతర నాయకులు

భీమవరం: టెలికం రంగంలో విప్లవాత్మక మార్పు తెచ్చిన ఘనత దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీదేనని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. భీమవరం పట్టణం గునుపూడిలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ ఇన్‌చార్జ్ అంకెం సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామరాజు మెమోరియల్ హాలు నిర్మించాలి

భీమవరం: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాలు వెంటనే నిర్మించి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. మెమోరియల్ హాలు నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)కు మంగళవారం వినతి పత్రం అందించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు, పట్టణ పేదల సంక్షేమ సంఘం నాయకుడు ఎం.వైకుంఠరావు, సీఐటీయూ నాయకులు ఎం.ఆంజనేయులు, ఎం.మునియ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పార్కు పరిశీలన

పట్టణంలోని బీవీ రాజు మున్సిపల్ పార్కు చుట్టూ ఆక్రమణలకు గురికాకుండా ఆ ప్రాంతాన్ని సుందరీకరణ చేయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బీవీ రాజు మున్సిపల్ పార్క్ పరిసర ప్రాంతాలను ఎమ్మెల్యే అంజిబాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామలతో కలిసి పరిశీలించి ట్రాఫిక్ సమస్య లేకుండా అధికారులకు పలు సూచనలు చేశారు.

మహిళపై వ్యక్తి దౌర్జన్యం

ఆకివీడు: మండలంలోని పెదకాపురం గ్రామానికి చెందిన ఓ మహిళపై వ్యక్తి దాడి చేసినట్లు మగళవారం పోలీసులను ఆశ్రయించింది. పుడిసె నాగలక్ష్మి తన కుమార్తెతో నిద్రిస్తుండగా ఈనెల 18న వలవల నాగేశ్వరరావు(పొట్టోడు) అనే వ్యక్తి వచ్చి తలుపులు బద్దలు కొట్టి దౌర్జన్యం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలకు మంగళం



యండగండి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో కిటకిటలాడుతున్న రోగులు (ఫైల్)



రోగికి ఈసీజీ తీస్తున్న దృశ్యం (ఫైల్)

- జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో వైద్యం అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- వైద్యంతో పాటు ఉచితంగానే మందులు

ఉండి: గ్రామాల్లోని ప్రజలు వైద్యసేవల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన గత ప్రభుత్వం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహించింది. ఈ శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యుల ద్వారా సేవలను అందించడమే కాకుండా మందులను సైతం ఉచితంగా అందించింది. ఏదైనా ఆపరేషన్ అవసరమైతే ఆరోగ్య శ్రీ ద్వారా చేయించుకునేందుకు వీలుగా సిఫారసులను పంపేవారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలోనూ మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించారు. చిన్నపిల్లలు, గర్భిణులు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె, ఎముకలు వంటి వివిధ రోగాలకు నిపుణులైన కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లోనూ పని చేసే వైద్యులను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రప్పించి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించే వారు. జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతీ వైద్య శిబిరానికి సుమారు 10 మంది స్పెషలిస్టు డాక్టర్లతో పాటు ప్రభుత్వ వైద్యులు అందుబాటులో ఉండి ఉదయం నుండి సాయంత్రం వరకు వైద్య సేవలు అందించేవారు.అలాగే 14 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు గుండె సంబంధిత ఈసీజీ కూడా సురక్ష శిబిరంలోనే తీసేవారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రజల వైద్యాన్ని గాలికి వదిలేసింది. గ్రామాల్లో మెగా వైద్య శిబిరాల నిర్వహణ మచ్చుకైనా కనిపించడం లేదు. నాటి ముఖ్యమంత్రి ప్రజారోగ్యానికి భరోసా ఇస్తే చంద్రబాబు మాత్రం తూట్లు పొడిచి గాలికొదిలేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రజలకు మేలు చేసే ఈపథకాన్ని ఇప్పటికైనా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ధైర్యంగా ఉండేవాళ్లం



గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో గ్రామీణ ప్రజలంతా చాలా ధైర్యంగా ఉండేవారు.మాకేమైనా జరిగితే మా జగన్‌బాబు ఉన్నాడు అంటూ వృద్ధులు సంతోషంగా ఉండేవారు.కానీ ఇప్పుడు వారికి ఆ ధైర్యాన్ని ఇవ్వడం లేదు.హెల్త్ క్యాంపులు నిర్వహణ లేకపోవడంతో చాలా మంది ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం పొందాల్సి వస్తుంది.

– వగ్రే పైడియ్య,
ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాములపర్రు.

పైసా ఖర్చు ఉండేది కాదు



జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఒక్కపైసా ఖర్చు లేకుండా అవసరమైన మేర ఉచితంగా పరీక్షలు నిర్వహించడం, ఈసీజీ తీయడం దానిని అక్కడే ఉన్న గుండె సంబందిత వైద్యులు పరీక్షించి అవసరమైతే మందులు ఇవ్వడం ఇదంతా చకచకా జరిగిపోయేది. రోగికి పైసా ఖర్చు ఉండేది కాదు.ఇప్పుడు రోగుల పరిస్థితి ఏంటో అర్థం కావడంలేదు.

– నిమ్మల కేశవకుమార్,
ఎంపీటీసీ సభ్యుడు,ఉప్పులూరు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



ఏలూరుపాడులో అవగాహన కల్పిస్తున్న అధికారులు



సిద్ధాపురం వర్మీ కంపోస్టు తయారీపై శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్లు

కాళ్ల: సర్పంచులకు కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏలూరుపాడు గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఎస్‌డబ్ల్యూఎం షెడ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మండలంలోని సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు వర్మీ కంపోస్ట్ ఎలా తయారుచేయాలి? చెత్తనుంచి సంపద తయారు చేయడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ఆకివీడు: వర్మీ కంపోస్టు తయారీ ద్వారా పంచాయతీల ఆదాయం వృద్ధి చేసుకోవచ్చని రిసోర్స్‌పర్సన్స్ మోహన్ కుమార్, పవన్ కుమార్ చెప్పారు. సర్పంచ్‌లు, కార్యదర్శుల మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం సిద్ధాపురం గ్రామంలోని చెత్త సేకరణ షెడ్ల వద్ద శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడి, పొడి చెత్తల్ని వేరు వేరుగా తీసుకువచ్చి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లలో ఉంచాలన్నారు. పొడిచెత్తలోని ప్లాస్టిక్, గ్లాస్ వస్తువుల్ని వేరు చేయాలన్నారు. తడి చెత్తను కుండీల్లో వేసి నిల్వ ఉంచాలన్నారు. దానిలో ఎలికపాములు వేసి వర్మీ కంపోస్టు తయారయ్యే విధంగా చూసుకోవాలన్నారు. ఎలిక పాములను చించినాడ వంతెన వద్ద ఉన్న ఎలిక పాముల హేచరీ నుండి కొనుగోలు చేసుకుని తెచ్చుకోవాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి పంచాయతీ వద్ద షెడ్ల నిర్మాణం పూర్తి అయిందన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు తడి పొడి చెత్తల్ని వేరు వేరుగా సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీకర్, సర్పంచ్ చిగురుపాటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

ఉండి: మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీ ప్రసాద్ అన్నారు. కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా మంగళవారం ఉండి సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులతో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు మహిళలపై ఆకృత్యాలు పెరిగిపోతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జి.శ్రీను, కె.రోహిత్, డి.సాగర్, కె.గోవింద్, మణిరత్నం తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో కొవ్వొత్తుల ర్యాలీ

భీమవరం: కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌ను పాశవికంగా హత్యాచారం చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని భీమవరం నియోజకవర్గ కూటమి పార్టీల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నుంచి ప్రకాశం చౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ హత్యపై విచారణ వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, బండి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉండిలో ధర్నా చేస్తున్న విద్యార్థులు



భీమవరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మైనర్లు డ్రైవింగ్ చేస్తే ఉపేక్షించం

ఆకివీడు: మైనర్లు ఏవిధమైన వాహనాలు నడిపినా ఉపేక్షించేంది లేదని ఎస్సై బి.నాగబాబు హెచ్చరించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో ప్రత్యేక డ్రైవ్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనర్లు నడుపుతున్న వాహనాల్ని ఆపి, వారితం డ్రుల్ని పిలిచి హెచ్చరించారు, కౌన్సిలింగ్ ఇచ్చారు. మొదటి తప్పుగా వదిలివేస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా పలువురు మైనర్ యువకులు ఇష్టానుసారం మోటారు సైకిళ్ల అతి వేగంగా నడుపుతున్నారని, హారన్‌లు మోగిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఆయన తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం ద్వారా వచ్చే ప్రమాదాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఆక్రమణల తొలగింపు

ఉండి: ఉండి ఇరిగేషన్ కార్యాలయం వద్ద నుంచి పాములపర్రు పంట కాలువ పక్కగా వున్న ఆక్రమణలను మంగళవారం అధికారులు తొలగించారు. ఆక్రమణల వల్ల పంట కాలువ పూడుకుపోయిందని ఆక్రమణలు తొలగిస్తేనే గాని పాములపర్రుకు తాగునీరు చేరదని చెప్పడంతో సుమారు 20 మంది వారి ఆక్రమణలు తొలగించారని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు తెలిపారు. ఆక్రమణల తొలగింపు పనులు, పాములపర్రు కాలువ మట్టి పూడికతీత పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పాములపర్రు ఎంపీటీసీ సభ్యుడుడ యడవల్లి వెంకటేశ్వరరావు, తోట రాము, సర్పంచ్ కేశన శాంత కుమారి బలుసుల రావు, ఉపసర్పంచ్ బాబీ తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలిక ఆత్మహత్యాయత్నం

ఉండి: మండలంలోని కలిగొట్ల గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమె ఇంటికి సమీపంలో నివసిస్తున్న ఇద్దరు మహిళలు పిల్లల విషయమై జరిగిన గొడవలో ఈ నెల 18న కొట్టడంతో దీంతో బాలిక మనస్థాపంలో పేయింట్‌లో కలిపే తిన్నర్ తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. ఇది గమనించిన కుటుంబికులు బాలికను భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం, బాలిక ఫిర్యాదు మేరకు మంగళవారం ఇద్దరి మహిళలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎండీ నజీరుల్లా తెలిపారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఉండి: మండలంలోని యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపా ఎస్.రమాప్రియ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు నేరుగా హాజరు కావాలని కోరారు. ఎంఏ ఇంగ్లిష్ లిటరేచర్‌లో ప్రథమ లేదా ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో నేరుగా హాజరు కావాలని ప్రిన్సిపల్ సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమలు దూరం



ప్రతిజ్ఞ చేయిస్తున్న పీహెచ్‌సీ వైద్యురాలు గోవర్ధిని

ఆకివీడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందవని, ప్రతి వ్యక్తీ దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు గోవర్ధిని పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ ఎనాఫిలిస్ దోమ వలన మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందనే విషయాన్ని రోనాల్డ్ రా ఆగస్టు 20వ తేదీన కనుగొన్నారని చెప్పారు. ఆ రోజును ప్రపంచ దోమ దినోత్సవంగా గుర్తించారన్నారు. దోమల వల్ల డెంగీ, చికున్ గున్యా, జికా వైరస్, మెదడు వాపు వ్యాధి, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. ప్రాణాంతక పరిస్థితులు కూడా వస్తాయని హెచ్చరించారు. అందువల్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల నుంచి రక్షణ పొందాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, దుర్గా ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ విన్నీ సరోజ, ఏఎన్‌ఎం కృపాలత తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ ఆక్రమణ



కొత్తపూసలమర్రు డ్రెయిన్ ఆక్రమించిన దృశ్యం

భీమవరం అర్బన్: మండలంలోని కొత్తపూసలమర్రు గ్రామంలో బ్యాంకు రోడ్డు ప్రక్కన మెయిన్ రోడ్డుకు ఆనుకుని కూల్‌డ్రింక్ షాపుదారుడు డ్రెయినేజీని ఆక్రమించాడు. దీంతో ఆ రోడ్డు చుట్టుపక్కల ఉన్న స్థానికులకు ఆక్రమణ వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ బ్యాంకుకు నిత్యం ద్విచక్రవాహనాలు, కార్లు రాకపోకలు సాగిస్తుంటాయి. కూల్‌డ్రింక్ షాపు నడుపుతున్న వ్యక్తి డ్రెయినేజీని ఆక్రమించి మెయిన్ రోడ్డుపై వచ్చే విధంగా రేకులషెడ్డు, సిమ్మెంట్‌తో గోడ కట్టి వాటిపై తినుబండారాలు, ఇతర ప్యాకెట్లు వేయడంతో మలుపు వద్ద వాహనాలు తిరగడం లేదని వాపోతున్నారు. అంతేకాకుండా ఎదురుగా వచ్చే వాహనాలు కనపడకపోవడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని చెబుతున్నారు. అంతేకాకుండా ఆ షాపు దారుడే కాకుండా ఇంకొందరు దుకాణాదారులు డ్రెయినేజీ ఆక్రమిస్తున్నారని వాపోయారు. పంచాయతీ అధికారులు ఇప్పటికైన స్పందించి ఆక్రమణలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

భీమవరం అర్బన్: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్సీ ఓట్లు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రావి రాంబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నవంబర్ 1న కొత్త ఓటర్ల జాబితా తయారువుతుందని సెకండరీ స్కూల్, జూనియర్ కళాశాల, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ, మోడల్ స్కూల్, ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలలో 3 సంవత్సరాల పాటు ఉపాధ్యాయులుగా పనిచేసిన వారు ఓటు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారమ్-19లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలు తహశీల్దార్, ఎంపీడీవో, మునిసిపల్ కమీషనర్ కార్యాలయాల్లో ఉంటాయని పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై దోపిడీ

మొగల్తూరు: మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వాహనదారుడు మూత్ర విసర్జన కోసం ఆగగా అటువైపుగా వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు నగదు, సెల్‌ఫోన్ తీసుకుని పరారైన సంఘటన సోమవారం రాత్రి మొగల్తూరు- నరసాపురం జాతీయ రహదారిపై జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి మొగల్తూరు ఏఎస్సై బి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం జగన్నాథపురానికి చెందిన ఎం.దుర్గారావు అనే వ్యక్తి తన మోటార్ సైకిల్‌పై పాలకొల్లులోని అత్తవారింటికి బయలుదేరాడు. మొగల్తూరు జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న దుర్గారావు రాత్రి 10 గంటల సమయంలో కోతులగుంట వద్ద మూత్ర విసర్జనకు ఆగాడు. అదే సమయంలో సమీపంలోని తోటలో నుంచి ఇద్దరు వ్యక్తులు వచ్చి దుర్గారావు వద్ద ఉన్న రూ.22 వేలు నగదు, సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

అనధికార లే అవుట్ల జాబితా విడుదల

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీ ఉన్న అనధికార లేఅవుట్ల జాబితాను మంగళవారం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు విడుదల చేశారు. మున్సిపల్ కార్యాలయం నోటీసు బోర్డులో జాబితా ఉంచారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అనధికార లేఅవుట్లపై కఠిన చర్యలు చేపట్టామని చెప్పారు. పట్టణంలో ఉన్న మొత్తం అనధికార లేఅవుట్లను గుర్తించామని చెప్పారు. చట్టవిరుద్ధంగా ఈ లేఅవుట్స్‌లో ప్లాట్లు అమ్మకాలు చేసినా, కొనుగోలు చేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ లేఅవుట్లలో విద్యుత్, డ్రెయిన్స్, మంచినీరు వంటి మౌలిక వసతులు కల్పించమని చెప్పారు. బిల్డింగ్ ప్లాన్స్ ఇవ్వబోమని వివరించారు.

నేడు ఎస్సీ వర్గీకరణకు నిరసనగా బంద్

భీమవరం: ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ తీర్పును పునః సమీక్షించాలని కోరుతూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో భీమవరంలో బుధవారం బంద్ నిర్వహిస్తున్నట్లు పోరాట సమితి నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీలోని 59 కులాల జనాభా లెక్కలు తేలకుండా అడ్డంగా విభజించాలని కొన్ని రాజకీయ పార్టీల ప్రమేయంతో ఎస్సీలను విభజించాలని చూడడం హేయమైనచర్య అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్త బంద్‌లో భాగంగా భీమవరంలో చేపట్టే బంద్‌కు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఉండిలో..

ఉండి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ బుధవారం నిర్వహించే భారత్ బంద్‌కు ఎస్సీ సోదరులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల వారు సహకరించాలని మాలమహానాడు సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు తొర్లపాటి భాగ్యరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

ఖాళీ స్థలాలతో పారిశుద్ధ్య ఇబ్బందులు



చినమామిడిపల్లిలో అధ్వానంగా ఉన్న ఖాళీ స్థలం

నరసాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల కారణంగా పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సదరు స్థలాల యజమానులు తమ స్థలాలకు సరైన రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకు పోయి, దోమలు పెరిగి పారిశుద్ధ్యం క్షీణిస్తుంది. పట్టణంలో స్టేషన్ పేట, రుస్తుంబాద, చినమామిడిపల్లి, రాయిపేట, హౌసింగ్ బోర్డు కాలనీ, చలువ పేట, ఎన్టీఆర్ కాలనీ, వీవర్స్ కాలనీ, నందమూరి కాలనీ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాలన్నీ ఇళ్ల మధ్యే ఉండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి పోతున్నాయి. అలాగే చెత్త చెదారం చేరి దోమలు పెరిగిపోతున్నాయి. పట్టణంలో ఎక్కడెక్కడ ఖాళీ స్థలలు ఉన్నాయే గుర్తించి, ఆ స్థలాలు పూర్తి స్థాయిలో శుభ్రంగా ఉండేలా మున్సిపల్ అధికారులు నిరంతరం చర్యలు చేపట్టాలి. కానీ అలాంటి చర్యలేవి పట్టణంలో కానరావడం లేదు. కొన్ని నెలల క్రితం ఇలాంటి స్థలాల్లో మునిసిపాలిటీ హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. తరువాత ఈ అంశాన్ని వదిలేశారు. పట్టణంలో మొత్తంగా 250 వరకూ ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భర్త వేధింపులపై కేసు

ఆకివీడు: తన భర్త వివాహమైన దగ్గరనుంచి వేధింపులకు గురి చేస్తున్నాడని కమతవానిగూడెం గ్రామానికి చెందిన గంట మేరీమాత అనే మహిళ మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. ఎస్సై నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం 12 ఏళ్ల క్రితం ఏలూరుపాడు గ్రామానికి చెందిన గంట ప్రకాష్‌తో వివాహమైందని, ఇద్దరు పిల్లల ఉన్నారని ఫిర్యాదులో పేర్కొంది. ప్రతిరోజు తాగి వచ్చి కొడుతూ దుర్భాషలాడుతూ వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

భక్తులకు గాజులు, రవికల పంపిణీ

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మెంటే వారితోటలోని శ్రీబాలత్రిపుర సుందరిదేవి అమ్మవారికి అమ్మవారికి అలంకరించిన 3 వేల గాజులు, పసుపు, కుంకుమలను భక్తులకు అందజేశారు. ముందుగా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ చే అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి అమ్మవారికి అలంకరించిన గాజులు, పసుపు కుంకుమలను భక్తులు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇంద్రకీలాద్రిపై అలరించిన నృత్య ప్రదర్శనలు



కూచిపూడి విద్యార్థులకు జ్ఞాపికలు ఇస్తున్న విజయవాడ కనకదుర్గ ఆలయ అధికారులు

నరసాపురం: విజయవాడ ఇంద్రకీలాద్రిపై ధర్మపథం వేదికపై నరసాపురం శ్రీఆదిపరాశక్తి నృత్యనికేతనం విద్యార్థులు ఇచ్చిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఏపీ రాష్ట్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనల్లో ఆదిపరాశక్తి నృత్యనికేతనం ప్రిన్సిపాల్, నాట్యాచారిణి వలవల అనంతలక్ష్మీదేవి శిష్యులు 30 మంది నాట్యప్రదర్శనలు ఇచ్చారు. దుర్గాదేవి నృత్య రూపకం, శివపంచాక్షరి, లింగాష్టకం, అష్టలక్ష్మీ వైభవం తదితర నృత్యరూపకాలకు విద్యార్థుల ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.